

సారె ఊరేగింపులో ఎంవీవీ ప్రసాద్, కమిటీ సభ్యులు, భవానీలు

దుర్గాదేవికి ఘనంగా సారె

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు కొండపైనున్న కనకదుర్గమ్మకు సారె, చీర, గాజులు, పసుపు కుంకుమను భారీ ఊరేగింపుతో సోమవారం సమర్పించారు. జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ కావిడితో సారె మోశారు. చండీమాత అవతారంలోనున్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యూరు సర్పంచి మాకాడ బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు చక్రరావు, చిరంజీవి, రాజశేఖర్, నాగేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయ పోటీలకు గిరి విద్యార్థి

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి లాంగ్‌జంప్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల జరిగాయి. అండర్- 18 విభాగంలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యార్థి టి. ఓంకార్ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ విద్యార్థి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యాడని పీడీ శివరామ్‌కుమార్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి, అధ్యాపకులు అభినందించారు.



ఓంకార్

మినీ గోకులాల్లో మింగేశారిలా..



రైతులే నిర్మించుకున్నా ఏజెన్సీకి బిల్లులు

షెడ్లు లేకపోయినా ఉదారంగా చెల్లింపులు

అధికారుల చేతివాటం రూ.5.89 కోట్లు

ఈనాడు, పాడేరు, అనకాపల్లి

పశువులకు నీడ కోసం నిర్మించిన మినీ గోకులాల షెడ్లలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. పాడి రైతులకు ఊతమిచ్చేలా రూపొందించిన పథకాన్ని అధికారులు, సరఫరా సంస్థ కలిసి పక్కదారి పట్టించారు. గతేడాది రైతులు ఫిర్యాదుతో కదిలిన ఈ అక్రమాల డొంక పశు సంవర్ధక శాఖలో ముగ్గురు అధికారుల మెడకు చుట్టుకుంది. అప్పట్లో పాడేరు, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన జి.వెంకటస్వామి, అశ్వత్థామ, జి.గౌతమ్‌లను బాధ్యులుగా గుర్తించి ఇదివరకే సస్పెండ్ చేశారు. తాజాగా గోకులం నిర్మాణాలకు సంబంధించి రూ.5.89 కోట్ల సొమ్ముల చెల్లింపుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై అభియోగాలు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పాడి పశువుల సంరక్షణార్థం ఉపాధిహామీ నిధులతో గోకులం షెడ్లను నిర్మించారు. పశువులకు తగిన నీడ, సదుపాయాలను కల్పిస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందని అప్పటి సర్కారు సదుద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలో 4,570 యూనిట్లు మంజూరు చేసింది. రైతులకు అవగాహన కల్పించి గోకులాలు, మినీ గోకులాల షెడ్ల నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించింది. దీనికోసం పశు సంవర్ధకశాఖ, ఉపాధిహామీ అధికారుల సమన్వయంతో కమిటీలు ఏర్పాటు చేసి లక్ష్యాలను విధించింది. ఇక్కడే కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ప్రభుత్వానికి లక్ష్యాలను చేరుకున్నట్లు చూపించడం కోసం షెడ్ల నిర్మాణాలు జరగకపోయినా ప్రగతిలో ఉన్నట్లు దస్త్రాల్లో చూపి బిల్లులు చేసుకున్నారు. కొంత మంది రైతులు సొంతసొమ్ముతో షెడ్లు నిర్మించుకున్నారు. అయితే వారికి తెలియకుండా మెటీరియల్ సరఫరా చేసే సంస్థ పేరిట బిల్లులు చెల్లించి అధికారులు వాటాలు పంచుకున్నారు. కొన్నిచోట్ల సామాజిక తనిఖీల్లో ఈ బాగోతం బయటపడినా స్థానికంగా రాజీచేసుకున్నారు. మరికొంతమంది షెడ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



ఇలాంటి మినీ గోకులాల నిర్మాణాల్లోనే అక్రమాలు



మాయాజాలం ఇలా..

మండలం	మంజూరైన యూనిట్లు	ఏజెన్సీకి పనులు	చెల్లింపుల విలువ (రూ.లక్షల్లో)
చీడికాడ	82	73	66.43
వి.మాడుగుల	113	111	89.06
గొలుగొండ	81	77	63.16
నర్సీపట్నం	16	16	16.01
రావికమతం	36	36	33.57
రోలుగుంట	15	15	15.54
మాకవరపాలెం	151	149	155.58
కోటవురట్ల	276	111	99.35
	770	588	539.33

క్షేత్రస్థాయి విచారణతో...

మినీ గోకులాలపై అందిన ఫిర్యాదుతో అప్పటి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టారు. డ్వామా ఏపీడీ రోజారాణి, డీఆర్సీ ఏపీవో నాగలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రసాదరావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. షెడ్లను లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోవచ్చు. లేకపోతే మెటీరియల్ సరఫరా సంస్థకైనా అప్పగించుకునే వెసులుబాటు ఉంది. లబ్ధిదారుల ఆమోదంతోనే థర్డ్ పార్టీకి అప్పగించాలి. అయితే అధికారులు 477 పనులకు సంబంధించి రైతులు సొంతంగా నిర్మించుకున్నా వారి అనుమతి లేకుండా సాయి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. షెడ్ల నిర్మాణాలు చేపట్టకపోయినా రూ.19.14 లక్షలు థర్డ్ పార్టీకి బిల్లులు చెల్లించారు. అసంపూర్తి పనులు చేసినా పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించేశారు. ఇలా రూ.30.66 లక్షలు సాయి బాలాజీ సంస్థ పేరిట బిల్లులు చేశారు. 117 షెడ్ల నిర్మాణాలకు సంబంధించి ఎం.బుక్, ఇతర దస్త్రాలను విచారణ అధికారులకు చూపించలేక పోయారు. మిగిలిన రికార్డుల నిర్వహణ సరిగ్గా లేదని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అప్పటి అధికారుల నిర్లక్ష్యమే కారణమని తేల్చారు.

అరకు సందర్శనలో

హైకోర్టు న్యాయమూర్తి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎస్‌జె రవినాథ్ తిల్హరి, కుటుంబసభ్యులతో కలసి సోమవారం అరకులోయలో పర్యటించారు. విశాఖ నుంచి రైలు మార్గంలో అరకులోయ చేరుకున్న వారు గిరిజన, కాఫీ మ్యూజియంలు సందర్శించారు. గిరిజన గ్రామాల నేపథ్యం, స్థానిక ఆహార్యం, సంప్రదాయాలు తెలుసుకున్నారు. అరకులోయ సమీపంలోని గంజాయిగుడ వద్ద ఉన్న గిరి గ్రామ దర్శినిని సందర్శించారు. అక్కడ న్యాయమూర్తి దంపతులు గిరిజన సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకుని ఆనందంగా గడిపారు.



గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో జస్టిస్ రవినాథ్ తిల్హరి దంపతులు

గుల్లేటివాడలో సినిమా చిత్రీకరణ సందడి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరరామచంద్రాపురం మండలంలో సినిమా చిత్రీకరణతో సందడి నెలకొంది. విషయం తెలిసి పలు వురు యువత చిత్రీకరణ జరుగుతున్న స్థలానికి వెళ్లడానికి ప్రయత్నించారు. చిత్రీకరణ ప్రదేశానికి చాలాదూరంలోనే యూనిట్ సిబ్బంది వారిని నిలివేశారు. మారుమూల అటవీప్రాంతానికి దగ్గరున్న గుల్లేటివాడ గ్రామానికి సామగ్రి, గుర్రాలు, వాహనాలను చేర్చారు. నటులు నాజర్, నందితాదాసుపై కొన్ని సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించనున్నారు. గుల్లేటివాడకు చెందిన గ్రామస్థులకు సంబంధించిన పొలాల్లో ప్రత్యేక సెట్లు వేసి, షూటింగ్ చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.



షూటింగ్‌కు సిద్ధం చేస్తున్న సామగ్రి

అర్హులందరికీ పింఛన్లు ఇప్పిస్తా

వై.రామవరం, మారేడుమిల్లి, న్యూస్‌టుడే: వై.రామవరం తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ప్రజాదర్బారు కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి వినతులు సమర్పించారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీలు, జలవనరులు, గృహ నిర్మాణాలకు సంబంధించిన వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. తహసీల్దారు అనసూయ, ఎంఈవో తాతబ్బాయి దొర, ఏపీవో సాయి బాబా, ఏఈలు సత్యన్నారాయణ, దివాకర్, తెదేపా నాయకులు మఠం విజయభాస్కర్, భాజపా పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.భారతి, పల్లాల వెంకటరమణారెడ్డి, పుష్పరాజ్, మడకం రామలక్ష్మి, రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గుర్తేడు సర్పంచి గొర్లె దుష్యంతుడు ఎమ్మెల్యే శిరీషాదేవికి సోమవారం విన్నవించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

20,226 కుటుంబాలకు రూ.10.84 కోట్లు

పాడేరు, న్యూస్‌టుడే: గత నెలలో సంభవించిన వరదలు, భారీ వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన 20,226 కుటుంబాలకు రూ.10.84 కోట్ల పరిహారం మంజూరు చేసినట్లు కలెక్టర్ ఏ.ఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ముందుగా 19,892 మంది లబ్ధిదారులను గుర్తించామని, సచివాలయాల్లో ప్రకటించిన జాబితాలపై అభ్యంతరాలు విచారించి 20,226 మందిని ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. దెబ్బతిన్న 492 ఇళ్లకు రూ.10వేల చొప్పున, ముంపునకు గురైన 1692 ఇళ్లకు రూ.10వేల చొప్పున, జీవనోపాధి కోల్పోయిన 18,042 కుటుంబాలకు (కుటుంబంలో ఇద్దరికి రోజుకు రూ.600 చొప్పున) మంజూరు చేసినట్లు తెలిపారు. వీరిలో 15,642 మంది బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసిందన్నారు. మిగిలిన 4,584 మందికి సంబంధించి సాంకేతిక సమస్యలు పరిష్కరించి సోమవారం వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు.

కిశోర వికాసం..

అనకాపల్లికి చెందిన బాలికకు రెండేళ్ల క్రితం వివాహం చేస్తున్నారన్న సమాచారంతో అంగన్‌వాడీ సిబ్బంది వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహం ఆపించారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం కలిగే నష్టాలు, బాధ్యులపై పెట్టే కేసులను వివరించారు.

ఎలమంచిలికి చెందిన బాలికని తల్లిదండ్రులు పదోతరగతి వరకు చదివించారు. ఇంటర్ చదివించే స్థోమత లేకపోవడంతో ఆమె చదువు ఆగిపోయింది. ప్రస్తుతం విద్యార్థిని ఇంటి వద్దనే ఉంటోంది.

-పాడేరు, అనకాపల్లి, న్యూస్‌టుడే

చదువు మానేస్తున్న బాలికల గుర్తింపు

కూటమి ప్రభుత్వ హయంలో బాలికల సంక్షేమానికి చొరవ



జిల్లాలో ఎంతో కిశోర బాలికలు చదువుకు దూరంగా ఉంటున్నారు. ఇది వరకు తెదేపా హయాంలో కిశోరబాలికలను గుర్తించి వారి స్థితి గతులపై సర్వే చేసి వారికి పోషకాహారం, నేప్‌కిన్ కిట్ అందజేసేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఐరన్‌మాత్రలు మాత్రమే అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లాలో సర్వే చేపట్టి కిశోరబాలికను గుర్తించి వీరిలో ఎంతమంది చదువు మానేశారనేది సర్వే చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్టోబరు నెలాఖరుకల్లా దీన్ని పూర్తిచేసేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు చొరవ చూపుతున్నారు. జిల్లాలో 14 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికల వివరాలతో పాటు వీరిలో చదువు మధ్యలో ఆపేసిన వారు ఎంతమంది ఉన్నారో గుర్తిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 75 మందిని గుర్తించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీరి అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

బాల్యవివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, కళాశాలలు అందుబాటులో లేకపోవడం, ఇంటి బాధ్యతలు ఇలా ఎన్నో కారణాలతో కిశోర బాలికల్లో చాలామంది చదువుకు దూరం అవుతున్నారు. ఆడపిల్లలకు పెళ్లి చేసేస్తే సరిపోతుందన్న భావన కొందరి తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉన్న కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఈ సమస్యను పరిష్కరించి కిశోర బాలికలకు చదువు చెప్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కిశోర వికాసం పేరుతో 14 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికలను గుర్తిస్తారు. వీరిలో ఎంత మంది చదువుమానేశారన్నది గమనించి వారు ఏఏ కారణాలతో చదువు మానేశారో వివరాలు సేకరిస్తారు. ఇలా సేకరించిన అనంతరం చదువు మానేసిన కిశోరబాలికలకు ఎంత మంది ఉంటే వారిని గ్రామాల వారీగా గ్రూపులు పెడతారు. వీరిలో చదువు మధ్యలో ఆపేసిన వారికి చదువు చెప్పడం. స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమైన వారికి శిక్షణ, వృత్తివిద్యా కోర్సుల్లో చేర్పించడం ఇలా వారికి దేనిపై ఆసక్తి ఉందో వాటిని నేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎంత మంది ఉన్నారో గుర్తించి వారికి శిక్షణ అందించే ఏర్పాట్లను ప్రభుత్వం చేయనుంది.



సిబ్బందికి శిక్షణ..

కిశోర వికాసం కింద చదువు మానేసిన బాలికలను గుర్తించేందుకు చేపట్టాల్సిన సర్వేపై జిల్లాలోని తొమ్మిది మంది సీడీపీఓలు, 52 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చాం. వీరు జిల్లాలోని 1630 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి కిశోర బాలికలను గుర్తించే కార్యక్రమాన్ని ఈనెలాఖరు కల్లా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

– ఎల్.సుజాత, నోడల్ అధికారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ



శాఖల సమన్వయంతో..

చదువు మానేసిన వారిని గుర్తించి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో గత ఏడాది 14 నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికలు 18,351 మంది ఉండగా.. వారిలో 1085 మంది చదువు మానేసినట్లు గుర్తించాం. ఈ నెల 15వరకు సర్వే నిర్వహిస్తున్నాం. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వైద్యులతో పరీక్ష చేయించడం, పోషకాహార లోపాలు సరిదిద్దడానికి వైద్యులతో, విద్య కోసం సంబంధిత అధికారులతో, ఉపాధి శిక్షణకు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసి కిశోర వికాసానికి చొరవ చూపుతాం.

- ఎన్.సాయి సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ



బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

దొంతురాయి పాఠశాల హెచ్‌ఎంపై వేటు

పాడేరు, న్యూస్‌టుడే: బాలలతో పనులు చేయించుకుంటే కఠిన చర్యలు చేపడతామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ హెచ్చరించారు. హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన కాకరి ప్రమీల కుమార్తె మోహితదేవి (9) దొంతురాయి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెండు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన శెట్టి మనోహర్ తన పిల్లలతోపాటు మోహితదేవిని రాజమహేంద్రవరం తీసుకెళ్లాడు. తన ఇంట్లో వెట్టిచాకిరీ చేయించసాగాడు. ఎలాగో బాలిక తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి గమనించి పోలీసులకు అప్పగించారు. అక్కడి పోలీసుల సమాచారం మేరకు రంపచోడవరం సీడీపీఓ సంధ్యారాణి, అడ్డతీగల సీడీపీఓ సుధలను రాజమహేంద్రవరం పంపించారు. సీడీపీఓలు బాలికను పాడేరు తీసుకొచ్చి ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మికి శనివారం అప్పగించారు. ఆమె సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిశారు. బాలికను బాలల సదనంలో చేర్పించాలని పీవో సూచించారు. బాలకార్మిక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఇంట్లో పనులు చేయిస్తున్న మనోహర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రెండు నెలలుగా బాలిక పాఠశాలకు గైర్హాజరైనా పట్టించుకోని దొంతురాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఈఓ బ్రహ్మాజీరావుకు సూచించారు. రెండు రోజులపాటు విద్యార్థులు పాఠశాలలకు రాకపోతే వెంటనే సమాచారం తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ రజని, డీఈఓ బ్రహ్మాజీరావు ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, సూపర్‌వైజర్ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీఓ అభిషేక్‌తో ఇన్‌ఛార్జి డీడీ రజని, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, బాలిక మోహిత దేవి

రాకపోకలకు ఇక్కట్లపై మొర

రంపచోడవరం, న్యూస్‌టుడే: పెదగెద్దాడ నుంచి సోకులగూడెం వరకు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయిన మూడు కల్వర్టులకు మరమ్మతు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు నర్రి పాపారావు, గిరిజనులు విన్నవించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఐటీడీఏ పీవో సింహాచలాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏపీవో రమణ వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 43 వినతులు వచ్చాయని వారు చెప్పారు. సువర్లవాడలో సామాజిక భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయని స్థానికులు కుర్ల చిరంజీవి రెడ్డి, ఆదిరెడ్డి, రామకృష్ణారెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దేవీపట్నం మండలం ఎర్రమెట్ల నుంచి పెద్దనూతులు వరకు, మద్దిరాతిగూడెం నుంచి కుటకరాయి వరకు రోడ్లు వేయాలని సర్పంచి కర్రి చిన్నబ్బులు రెడ్డి, గిరిజనులు పండురెడ్డి, రామిరెడ్డి విన్నవించారు. మారేడుమిల్లి మండలం చట్లవాడలో ఫైబర్‌నెట్ పనిచేయడంలేదని పల్లాల రమేష్‌రెడ్డి, బత్తుల ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజు, డీఎల్‌పీవో రాఘవన్, పీహెచ్‌వో చిట్టిబాబు, పీఏవో రాంబాబు, ఉపాధిహామీ ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీడీ కార్యాలయ పర్యవేక్షకులు కిషోర్, లీగల్‌సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

పర్యటక కేంద్రాలు కిటకిట



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యటక కేంద్రాలు బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అనంతగిరి కాఫీతోటలకు సందర్శకులు పోటెత్తుతున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో భారీగా ఇక్కడకు వస్తున్నారు. బొర్రాగుహల అందాలు చూసి మంత్రముగ్ధులవుతున్నారు. జలపాతాల్లో కేరింతలు కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. సోమవారం ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా కనిపించాయి.

ఆపద్బాంధవుల నియామకానికి అడుగులు

ఈనాడు కథనానికి స్పందన

అరకులోయ, న్యూస్‌టుడే

అరకులోయ ప్రాంతీయ వైద్య కేంద్రంలో స్త్రీ వైద్య నిపుణుల నియామకం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇక్కడ స్త్రీ వైద్య నిపుణులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేవలం ఒక్కరు మాత్రమే గైనకాలజిస్టు ఉండటంతో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో ఆగస్టు 31న 'స్త్రీ వైద్య నిపుణుల కొరత.. గర్భిణుల కలత' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్య శాఖ అధికారులు స్పందించారు. ఇక్కడ స్త్రీ వైద్య నిపుణుల ఆవశ్యకతను వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ప్రభుత్వ పరిశీలనలో ఈ ప్రతిపాదన ఉందని అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే వైద్యుల నియామకం జరగనుందని అందరూ ఆశిస్తున్నారు.

కేజీహెచ్‌కు పరుగులు పెట్టాల్సిందే!

అరకులోయ ప్రాంతీయ వైద్య కేంద్రానికి అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. వీటిలో గర్భిణులు, బాలింతల సంఖ్యే అధికం. ఇక్కడ పూర్తిస్థాయిలో సేవలు అందకుంటే 120 కిలోమీటర్ల దూరంలోని విశాఖ కేజీహెచ్‌కి వెళ్లాల్సిన పరిస్థితి. సకాలంలో వైద్యసేవలు అందక ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల బూర్జ పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన ఓ గర్భిణిని చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తరలిస్తుండగా గర్భిణితోపాటు కడుపులోని శిశువు మృతి చెందారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అరకులోయ ప్రాంతీయ వైద్య కేంద్రంలో ఖాళీగా రెండు గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

● వాస్తవంగా అరకులోయ ఆసుపత్రిలో ముగ్గురు గైనకాలజిస్ట్‌లు ఉండాలని, ప్రస్తుతం ఒక్కరే సేవలు అందిస్తున్నారని జిల్లా డీసీహెచ్ కృష్ణారావు తెలిపారు. ఖాళీగా ఉన్న రెండు గైనకాలజిస్ట్ పోస్టులు భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. వైద్యుల పోస్టులు భర్తీ చేసినప్పుడు ఇక్కడ గైనకాలజిస్ట్‌లను నియమిస్తారని పేర్కొన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు.



భారీ మీనం.. రెక్కలు ఘనం



విశాఖ మత్స్యకారులకు సోమవారం సాగరంలో కొమ్ము కోనం చేపలు భారీగా లభించాయి. విశాఖపట్నం నుంచి కేరళ తరలించేందుకు వాటిని ప్యాకింగ్ నిమిత్తం ముక్కలు ముక్కలుగా కోశారు. కొన్ని చేపల రెక్కలు భారీగా పెరగడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఉపకరణం.. ఇలా ఉపయోగకరం!!

విశాఖపట్నం వుడా బాలల ప్రాంగణంలో సోమవారం దివ్యాంగులకు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. నడవలేని కొందరికి సరికొత్త పరికరాలు అందించారు. 'ఊత కర్ర పట్టుకొని నడిచివెళ్లి.. మార్గమధ్యలో అలుపు వస్తే అదే కర్రని కుర్చీలా మార్చుకొనే' పరికరం కూడా ఇందులో ఉంది. అది ఏవిధంగా పని చేస్తుందో ఈ వృద్ధుడు చూపించారు.



– ఈనాడు, విశాఖపట్నం

18 రోజుల పసికందు అదృశ్యం

- ఏడు గంటల ఉత్కంఠకు తెర
- అనంతరం క్షేమంగా తల్లి చెంతకు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలో 18 రోజుల పసికందు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఏడుగంటలు కొనసాగిన హైడ్రామా అనంతరం క్షేమంగా తల్లి చెంతకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించి ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దంపతులు డొక్కాచంటి భవాని, శివ దంపతులు విశాఖలోని కేంద్రకారాగానికి ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో నివాసముంటున్నారు. వీరికి 18 రోజుల కింద ఆడపిల్ల పుట్టింది. సోమవారం తెల్లవారుజాము 2 గంటలకు చంటి భవాని పక్కన నిద్రిస్తున్న చంటిపాప కనిపించటం లేదని శిశువు అమ్మమ్మ మువ్వల మంగ గగ్గోలు పెట్టడంతో స్థానికులంతా అక్కడికి చేరుకున్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. 2.30 గంటలకు ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆరిలోవ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆరిలోవ సీఐ గోవిందరావు, ఎస్సైలు కృష్ణ, రామదాసు, సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాల్లో వెతకటం ప్రారంభించారు. 3.30 గంటల సమయంలో ఏసీపీ రాంబాబు స్వయంగా రంగంలోకి దిగి గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు, డంపింగ్‌యార్డు ప్రాంతాలను స్థానికులతో కలిసి వెతికారు. అయినా ఫలితం లేదు. పెంచుకోవడానికి బంధువులకు ఇచ్చేశామని సుమారు 5 గంటల సమయంలో శిశువు అమ్మమ్మ మంగ చెప్పడంతో అందరూ కంగుతున్నారు. బంధువులు ఉంటున్న కశింకోట మండలం ఏఎస్ పేట గ్రామానికి ముగ్గురు కానిస్టేబుళ్లు వెళ్లారు. అనంతరం వారిని ఉదయం 7 గంటలకు శిశువుతో పాటు వారిని ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. 7 గంటల నుంచి 9 గంటల వరకు విచారణ జరిపిన అధికారులు నిర్ధారించుకున్నాక తల్లిదండ్రులకు శిశువును అప్పగించేశారు.



అమ్మమ్మ ఒడిలో శిశువు, పక్కన తల్లి



శిశువు అదృశ్యమైన ఇల్లు

ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇలా..

భవాని, శివ తొలి సంతానం ఆడపిల్ల. వీరి ఆర్థిక పరిస్థితి బాగోలేక రెండోసారి ఆడపిల్ల పుడితే కశింకోట ఏఎస్‌పేటకు చెందిన కొల్లా నాగఅప్పారావు దంపతులకు ఇవ్వాలని ముందే ఒప్పందం చేసుకున్నామని శిశువు అమ్మమ్మ మంగ తెలిపారు. కానీ శిశువు పుట్టాక తన అల్లుడు మనసు మార్చుకుని ఇవ్వటానికి అంగీకరించలేదు. దీంతో బంధువుల ఒత్తిడి మేరకు ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారికిచ్చి పంపిచేశానని తెలిపింది. కుమార్తె, అల్లుడు కోపగించుకుంటారని కుక్క ఎత్తుకుపోయినట్లు చెప్పానన్నారు. రెండు రోజుల తరువాత చెబుదామని అనుకున్నానని ఇంతలోనే ఇంత జరిగిందని తెలిపారు.

చిటికెలో.. పొట్టు తీద్దాం.. పప్పు చేద్దాం

- అందుబాటులో యంత్రాలు
- రూపొందించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

న్యూస్‌టుడే, అనకాపల్లి

చిరుధాన్యాలు, అపరాలను బాగు చేసి ఉప ఉత్పత్తులుగా విక్రయిస్తే రైతులకు మరింత ఆదాయం వస్తుంది. పొట్టు తీయడం, బద్దలుగా మార్చడం ఇప్పటివరకు పెద్ద పనిగా ఉండేది. యంత్రాలు అందుబాటులోకి రావడంతో చిటికెలో పని పూర్తవుతోంది. చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకుని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇంజినీరింగ్ విభాగం శాస్త్రవేత్తలు వీటిని తయారు చేశారు.

కేజీ మినుములు విక్రయిస్తే రైతుకు వచ్చేది రూ.70. పప్పుగా విక్రయిస్తే రూ.130 వస్తుంది. పప్పుగా మార్చే యంత్రాలు గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడంతో రైతులు పొలాల్లోనే చిరుధాన్యాలు, అపరాలను వ్యాపారులకు అమ్మేస్తున్నారు. అపరాల్లో మినుము, పెసర, కంది ఎక్కువగా సాగవుతోంది. వీటి పొట్టు తీయడంతోపాటు బద్దగా చేసేందుకు అధునాతన యంత్రాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని విలువ రూ.1.2 లక్షలు. గంటకు 125 కేజీల వరకు పొట్టు తీసి పప్పుగా చేయవచ్చు.



చిరుధాన్యాల పొట్టు తీసే యంత్రం



అపరాల పొట్టు, కొబ్బరి తురుము, ఉసిరి, అల్లంకు బెల్లం కోటింగ్ చేసే యంత్రాలు

చిరు ధాన్యాలకు ప్రత్యేకం..: ఇటీవల కాలంలో చిరుధాన్యాల వినియోగంతోపాటు సాగు బాగా పెరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు చోడి, కొర్రలు, ఊదలు, వరిగలు, అరికలు, సామలు సాగు చేస్తున్నారు. వీటిపై ఉండే పొట్టు తీసేందుకు శాస్త్రవేత్తలు యంత్రాన్ని తయారు చేశారు. దీని విలువ రూ.2.2 లక్షలు. గంటకు వంద నుంచి 150 కేజీల వరకు పొట్టు తీయవచ్చు.

రైతులకు శిక్షణ ఇస్తాం

ఆరుగాలం కష్టపడి సాగు చేసే రైతులకు దక్కేది పావలా అయితే.. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని ఉప ఉత్పత్తులుగా విక్రయించే వ్యాపారికి వంద శాతం లాభం వస్తోంది. రైతులే ఉప ఉత్పత్తులను చేసేందుకు అనువైన యంత్రాలను సిద్ధం చేశాం. ఆసక్తి ఉన్న రైతులు యంత్రాల పనితీరును స్వయంగా పరిశీలించవచ్చు. అవసరమైన సాంకేతిక సలహాలతోపాటు యంత్రాలను ఉపయోగించే విధానంపై శిక్షణ ఇస్తాం.

– డాక్టర్ పీవీకే జగన్నాథరావు, ప్రధాన శాస్త్రవేత్త

రైతేరాజు

వంగ మువ్వులో కీటకాలు.. నివారణ చర్యలు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సలహా

? అర ఎకరాలో వంగ తోట వేశా. మొవ్వును కీటకాలు ఆశించాయి. నివారణకు ఏం చేయాలి.

– ఏవీ రామారావు, వెంకుపాలెం

✔ పురుగులు ఆశించిన కొమ్మల చివర్లను తుంచేయాలి. లీటరు నీటిలో మూడు గ్రాములు కార్బరిల్ / రెండు మి.లీ. ప్రొఫినో పాస్ ద్రావణం పిచికారీ చేయాలి.

? ఇటీవల కురిసిన వర్షాలకు ఎకరా విస్తీర్ణంలో వరి పంట కుళ్లిపోయింది. రబీలో వరి వేద్దామనుకుంటున్నా. ఏఏ రకాలు అనుకూలం.

– కాకి అప్పారావు, వాడ్రాపల్లి

✔ రబీలో వరి సాగు చేసేందుకు విజేత, పుష్యల, శ్రీసత్య, కాటన్ దొర సన్నాలు, నెల్లూరు మసూరి రకాలు అనుకూలం.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దాడి ఉమామహేశ్వరరావు సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

సాగులో సందేహాలా ఫోను చేయండి

చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త సందీప్ నాయక్ సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య 86884 45135 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

మధ్య రకం బెల్లం ధరలో వృద్ధి




రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,965	4,960
మధ్య	3,750	4,220
నాసి	3,250	3,235

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో గత వారం రోజులుగా మధ్య రకం బెల్లం ధరలు భారీగా పెరిగాయి. రంగు, నాసిరకాల ధరలు స్వల్పంగా తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.5, నాసి రకాలు రూ.15 తగ్గాయి. మధ్య రకాలు రూ.470 పెరిగాయి.

పక్షులు.. రైతు నేస్తాలు

కీటక సంహారంలో తోడ్పాటు



న్యూస్‌టుడే, చింతపల్లి

పక్షి సంపద ప్రకృతి వరప్రసాదం. ఇవి కీటకాలను సంహరిస్తూ పంటల సాగులో రైతులకు సహకరిస్తున్నాయి. దేశంలో సుమారు 1200 జాతుల పక్షి జాతులున్నాయి. వీటిలో 346 జాతులు పంటలను ఆశించే పురుగులను ఆహారంగా తీసుకుంటూ రైతులకు పరోక్షంగా మేలు చేస్తున్నాయి. వివిధ దశల్లో పంటలను నష్టపరుస్తున్న పురుగులను సమర్థవంతంగా గుర్తించి వాటిని భక్షిస్తాయి. ప్రధానంగా తెల్లకొంగలు, మంగలిపిట్ట, గోరింక, పాలపిట్టలు రైతు నేస్తాలుగా గుర్తింపుపొందాయి.

- పత్తి, కంది పంటలను నాశనం చేసే శనగపచ్చ పురుగు, పొగాకులో లద్దె పురుగులను 40-60 శాతం వరకు పక్షులే నాశనం చేస్తాయి. ఒక కొంగ 20 నిమిషాల్లో వేరుశనగలో 50 పురుగులను తింటుంది.
- భూమిని ఒకటికంటే ఎక్కువసార్లు దున్నడం వల్ల వేరుపురుగులు బయటకు వచ్చి పక్షుల బారినపడతాయి. గుడ్లగూబలు రాత్రి సమయంలో పొలాల్లో సంచరిస్తూ తల్లివేరు పురుగులను ఆహారంగా తింటుంటాయి. గోరింకలు, పిచ్చుకలు వ్యాధి సోకిన వేరు పురుగులు, శనగపచ్చ పురుగులను తింటూ పరోక్షంగా బ్యాక్టీరియా వ్యాప్తికి దోహదం చేస్తాయి.





వరి పొలంలో పక్షులు వాలేందుకు కర్రల ఏర్పాటు



పక్షి జాతులను కాపాడుకోవాలి..: వివిధ రకాల పక్షులను సంరక్షించడం ద్వారా పంటలను ఆశించే వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలను సమర్థంగా నివారించవచ్చు. ఇందుకోసం పంట పొలాల్లో 'టి' ఆకారంలో కర్రలను ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేయాలి. పసుపు కలిపిన అన్నం, నీటిని పంట పొలాల వద్ద ఉంచడం ద్వారా పురుగులను తినేందుకు పక్షులు ఎక్కువగా వస్తాయి. మోదుగ, చీమచింత, మల్బరీ, నేరేడు చెట్లను పొలం గట్లపై పెంచడం ద్వారా వివిధ రకాల పక్షి జాతులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటాయి.

– డాక్టర్ అప్పలరాజు, కీటక విభాగం శాస్త్రవేత్త

ప్రత్యేక కేటగిరీగా బదిలీలు చేపట్టాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో గిరిజన ప్రాంతానికి బదిలీ అయిన మైదాన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి కోరారు. అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణ, నక్కా శ్రీనుబాబు, ఎంటీఎస్ నాయకుడు వేచలపు ఈశ్వరరావులతో కలిసి ఆమె మాట్లాడారు. తమ సమస్యను మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవి, ఏఎస్ రామకృష్ణలకు ఎన్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటరావు, బి.హైమారావులతో కలిసి వివరించామన్నారు. జిల్లా మంత్రి అనిత దృష్టికి కూడా తెచ్చామన్నారు. అన్యాయాన్ని సరిచేస్తామని వారు హామీ ఇచ్చారని వివరించారు. 117 జీఓతో ఉపాధ్యాయులు ఇబ్బందుల పాలయ్యారన్నారు. జీఓ నంబరు 3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతానికి మైదాన ఉపాధ్యాయులు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా సుమారు 430 మంది ఉపాధ్యాయులకు గిరిజన ప్రాంతానికి బదిలీ అయ్యారన్నారు. ప్రత్యేక కేటగిరీ కింద వీరిని భావించి తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నందున త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో సంఘం తరఫున అభ్యర్థిని నిలిపే ఆలోచన చేస్తున్నామన్నారు.



ఎమ్మెల్సీ అశోక్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

విశాఖ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దసరా, పైడితల్లి సిరిమానోత్సవాల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విశాఖ-శ్రీకాకుళంరోడ్-విశాఖ(08529-08530) ప్రత్యేక మెమూ రైలు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు ఉదయం 10 గంటలకు విశాఖలో బయలుదేరి సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలు దేరి మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుకోనున్నట్లు తెలిపారు.

విశాఖ వచ్చే రైళ్ల సమయాల్లో మార్పు

న్యూదిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోర్బా, మచిలీపట్నం, నాందేడ్, బ్రహ్మపుర, కాకినాడ పోర్టు, భవానీపట్న, గాంధీధామ్, దుర్గ్, తిరుపతి, లోకమాన్య తిలక్, రాయపూర్, కిరండూల్, గుణుపురం, సికింద్రాబాద్, కొల్లాం ప్రాంతాల నుంచి విశాఖకు తిరుగు ప్రయాణమయ్యే పలు రైళ్లు.. గమ్యస్థానానికి 5 నుంచి 25 నిమిషాలు ఆలస్యంగా చేరుకునేలా వేళలు మార్పు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 15వ తేదీ నుంచి కొన్ని రైళ్లకు ఈ సమయాలు అందుబాటులోకి రానుండగా మరికొన్నింటికి 18, 19, 20 తేదీల నుంచి వర్తించనున్నట్లు పేర్కొన్నాయి.

'సుభోజనం' వసతి కేంద్రం ప్రారంభం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు రూ.10కే రుచికరమైన భోజనం అందించేలా హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ ఛారిటీస్ సంయుక్తంగా ఆసుపత్రి ఎముకల విభాగ సమీపంలో ఏర్పాటు చేసిన 'సుభోజనం' వసతి కేంద్రాన్ని విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ఉదయం ప్రారంభించారు. 150 మంది ఒకేసారి కూర్చొని భోజనం చేసే విధంగా కేంద్రాన్ని తీర్చిదిద్ది అవసరమైన వసతులు కల్పించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సుభోజనం నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హరేకృష్ణ సంస్థ విశాఖ అధ్యక్షులు నిష్కించన భక్తదాస శ్యామ్‌మాధవ దాస్, పిల్లల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

40 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని దేవరాపల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గంజాయితోపాటు కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు. జోలాపుట్ నుంచి దేవరాపల్లి మీదుగా గంజాయి రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో శ్రీరాంపురం కూడలిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కారును ఆపి తనిఖీ చేయగా.. డిక్కీలో 40 కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కోరాపుట్ జిల్లా నందాపూర్‌కు చెందిన కారు డ్రైవరు మోహన్ బైరాగి, అతడి సోదరుడు పద్మన్ కెముండి, అతుల్ సోనీని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

పొదల్లో దాక్కున్న గంజాయి నిందితుల పట్టివేత

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పొదల్లో దాక్కున్న నలుగురు గంజాయి నిందితులను నర్సీపట్నం గ్రామీణ పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై పి.రాజారావు కథనం ప్రకారం.. నర్సీపట్నం మండలం గబ్బాడకు సమీపంలోని సాధూపాకల వద్ద ఆదివారం సాయంత్రం బస్సులను ఆపి పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలు జరుగుతున్న విషయం కొంతదూరం నుంచే గమనించిన గంజాయి స్మగ్లర్లు బస్సు ఆపించి మూటతో దిగిపోయి పొదల్లో కలిసిపోయారు. వీరు పొదల్లోకి వెళ్లడం గమనించిన సిబ్బంది అనుమానంతో వెదికి పట్టుకున్నారు. నిందితులను ఒడిశాలోని కేంద్రపడ జిల్లా షమ్‌సారా గ్రామానికి చెందిన రష్మీ రంజన్ సాహు (40), తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని కరుణానిధి నగర్‌కు చెందిన ఆర్ముగం సురేష్‌కుమార్ (37), ముత్తు కుమార్ (30), అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం వంజంగి పంచాయతీ గొంది మెలక గ్రామానికి చెందిన బురిడి గురుమూర్తి (32)గా గుర్తించినట్లు ఎస్సై వివరించారు. వీరి నుంచి ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.



పోలీసులకు గంజాయితో పట్టుబడిన నిందితులు

ప్రత్యేక గ్రీవెన్సులో 70 అర్జీలు

పాడేరు, న్యూస్‌టుడే: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్సుకు 70 ఫిర్యాదులు అందాయి. గిరిజన సంక్షేమ శాఖ(విద్యా) విభాగం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగుల పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, పెండింగ్ జీతాలు, సర్వీసు రెగ్యులరైజేషన్, డిప్యుటేషన్లు, బదిలీలపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. పీఓ మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి గిరిజన సంక్షేమ(విద్య) ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇన్‌ఛార్జి డీడీ రజని, ఏటీడబ్ల్యూవోలు క్రాంతికుమార్, వెంకటరమణ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అభిషేక్, చిత్రంలో ఇన్‌ఛార్జి డీడీ రజని

పదోన్నతులు కల్పించాలని వినతి

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయవాడలో గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబుకు ఆ సంఘ నేతలు వినతిపత్రం అందజేశారు. ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రేగం సూర్యనారాయణ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో మంజూరైన డిప్యూటీ డీఈఓ, డీఈఓ పోస్టులను త్వరితగతిన అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, పాడేరు ఐటీడీఏ పరిధిలో పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. ఉపాధ్యాయులకు రాత్రి బస నుంచి మినహాయింపు ఇవ్వాలని వివరించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి శేషగిరిరావు, గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు జి.వి.వి ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కార్యదర్శి కన్నబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు సూర్యనారాయణ తదితరులు

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

పాడేరు, న్యూస్‌టుడే: డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించిన స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థి వంతాల సింహాచలంను కలెక్టర్ దినేష్‌కుమార్ అభినందించారు. ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్‌త్రో విభాగంలో సింహాచలం మొదటి స్థానం, షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచి బంగారు, రజత పతకాలు సాధించాడు. ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు, కోచ్ జి.మన్మథరావుతోపాటు విద్యార్థిని కలెక్టర్ అభినందించారు.



సింహాచలంను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

యోగాతో లక్ష్య సాధన

యోగాతో ఏకాగ్రత పెరిగి లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, యోగా మాస్టర్ శిక్షణ పొందిన వారితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తిని బయటకు తీయాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ రజని తదితరులు పాల్గొన్నారు.

కొండ గట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గసభ పంచాయతీ జంగిడివలస గ్రామానికి చెందిన వంతాల మోసియా(63) కొండ గట్టుపై నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్సై పాపినాయుడు తెలిపారు. సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లిన మోసియా ప్రమాదవశాత్తు కొండ గట్టుపై నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు

రంపచోడవరం, వై. రామవరం, న్యూస్‌టుడే: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాల్సిన బాధ్యత పంచాయతీల పాలకవర్గ సభ్యులపై ఉందని ఎంపీపీ బందం శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో 'గ్రామ పరిపాలన- అభివృద్ధిలో ముఖ్యపాత్ర' అనే అంశంపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఎంపీడీవో సుందం శ్రీనివాసుదొర, ఈవోపీఆర్‌డీ జాన్‌మిల్టన్, ఉప ఎంపీపీ కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

★ వై.రామవరంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జడ్పీటీసీ సభ్యురాలు కర్రా వెంకటలక్ష్మి ఇందులో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవోఆర్‌డీ శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, టీవోటీ ఎన్.సుభాషిణి, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

తపాలా ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీకిషోర్

ముంచంగిపుట్టు, అరకులోయ, న్యూస్‌టుడే: అరకు తపాలా సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.లక్ష్మీకిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఉపేంద్రను గజపతినగరం సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు. గుడివాడలో పనిచేస్తున్న లక్ష్మీకిషోర్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. ఇన్‌ఛార్జ్ ఐపీఓ రవికుమార్ నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈయనకు మెయిల్‌ఓవర్‌సెలు గోపాల్‌పడాల్, శ్రీను తదితరులు స్వాగతం పలికారు.



లక్ష్మీకిషోర్‌కు స్వాగతం పలుకుతున్న తపాలా ఉద్యోగులు

మోతుగూడెం పంచాయతీ కార్యదర్శిగా మోహన్‌రావు

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం మేజర్ పంచాయతీ కార్యదర్శిగా గుంపెనపల్లి మోహన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మేజర్ పంచాయతీ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన రవినాయక్ ఏలూరు జిల్లా కామవరపుకోట బదిలీ అయ్యారు. నూతన కార్యదర్శిని సర్పంచి, ఎంపీటీసీ సభ్యుడు అకేటి సీత, వేగి నాగేశ్వరరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి పరిచయం చేసుకున్నారు.

జడ్పీ సీఈవోగా నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా పి.నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి సీఈవో సత్యనారాయణ నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో కాకినాడ డీఎల్‌డీవోగా పనిచేస్తూ బదిలీపై విశాఖకు వచ్చారు.

విద్యుత్తు తీగలు అమర్చితే కఠిన చర్యలు

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ, అటవీ భూముల్లో విద్యుత్తు తీగలు అమర్చితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా, అనధికారికంగా విద్యుత్తు తీగలు అమర్చి జంతువులు, మానవాళికి హాని కలిగించొద్దన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

గొలుగొండ, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అటవీశాఖ సెక్షన్ అధికారి రామానుజులు కోరారు. కొత్త ఎల్లవరంలో సోమవారం వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. ఈ పంచాయతీ శివారు కరక, జిల్లేడిపూడి అటవీ ప్రాంతంలో సంచరించే అడవి పందులు, కణుజులను వేటాడరాదని చెప్పారు. ఇటువంటి చర్యలు శిక్షలు కఠినంగా ఉంటాయని వెల్లడించారు. స్థానిక సర్పంచి రాంబాబు పాల్గొన్నారు.

భూవివరాలను పునరుద్ధరించాలని వినతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: గిరిజనుల సాగులో ఉన్న భూముల వివరాలను ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల్లో పునరుద్ధరించాలని కోరుతూ తామరబ్బ శివారు పల్లపుకోడాబుకు చెందిన రైతులు ఉప తహసీల్దారు అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారంతా తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గిరిజన సంఘ నాయకులు పైడిరాజు, మంగరాజు, చిన్నారావు, తమ్మయ్య, శ్రీను, ఈశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

దేవరాపల్లి: శ్మశానంలో మట్టి అక్రమం తవ్వకాలపై వీఆర్వో నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు. ఈ పొక్లెయిన్, ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

సకాలంలో వైద్యం అందక శిశువు మృతి



బంధువులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు



మృతి చెందిన శిశువు

సీలేరు, న్యూస్‌టుడే: దుప్పిల వాడ పంచాయతీలో సకాలంలో వైద్యం అందక నవజాత శిశువు మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలసగెడ్డ కాలనీకి చెందిన తాంబేలు సోమరా, పోర్తిమా దంపతులకు రెండు నెలల క్రితం జన్మించిన శిశువు(పూర్ణిమ) రెండు రోజులు జలుబు, దగ్గుతో బాధపడింది. ఆదివారం శ్వాస తీసుకోవడానికి కష్టంగా మారడంతో సీలేరు పీహెచ్‌సీకి మధ్యాహ్నం తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యాధికారి లేకపోవడంతో సిబ్బంది చూసి.. చింతపల్లి గానీ, చింతూరు గానీ తీసుకెళ్లాలని సూచించారు. కనీసం ఓపీ కూడా రాయలేదు. దీంతో చిన్నారిని ఇంటికి తీసుకెళ్లిపోయారు. మళ్లీ రాత్రి 9 గంటల సమయంలో శిశువు అస్వస్థతకు గురికావడంతో సీలేరు పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ సమయంలో కూడా వైద్యాధికారి అందుబాటులో లేరు. దీంతో సిబ్బందే అంబులెన్స్ ఇచ్చి చింతూరు రిఫర్ చేశారు. చింతూరు ప్రాంతీయ ఆసుపత్రికి అంబులెన్సులో తీసుకెళ్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో మంగంపాడు వద్ద చిన్నారి చనిపోయింది. సీలేరు పీహెచ్‌సీలో వైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యంతో సకాలంలో వైద్యం అందకపోవడంతో శిశువు చనిపోయిందని గ్రామానికి చెందిన పాంగి కృష్ణమూర్తి ఆరోపించారు. కూటమి నాయకులు చిటికెల రాము, బాలకృష్ణ, మింది తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధితులతో కలిసి పీహెచ్‌సీకి వెళ్లి వైద్యాధికారి షేక్ మస్తాన్‌వలీతో మాట్లాడారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై నిలదీశారు. దీనిపై వైద్యాధికారి స్పందిస్తూ.. తమకు ఆదివారం సెలవు, విధులకు రామని, ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని కూటమి నాయకులు పేర్కొన్నారు. సీలేరు, ధారకొండలో ఆదివారం సంత జరుగుతుందని, ఆయా రోజుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం తగదని వారు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దీనిపై వైద్యాధికారిని వివరణ కోరగా.. ఆదివారం సెలవు కావడంతో వేరే కార్యక్రమానికి వెళ్లామని, చరవాణిలో చిన్నారి పరిస్థితిని తెలుసుకుని చింతూరు రిఫర్ చేశామని చెప్పారు.

అసత్య ఆరోపణలు తగవు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పాడేరు డీఈవో కార్యాలయంలో కొందరు గిరిజనేతర ఉద్యోగులు.. గిరిజన ఉద్యోగులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వీటిని మానుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గెమ్మెల మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక గిరిజన ఉద్యోగ భవనంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గిరిజనేతర ఉద్యోగులు సేవా దృక్పథంతో పని చేయాలన్నారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యూవీ గిరి, మండల అధ్యక్షుడు బౌడ గంగరాజు, నాయకులు కుడుముల వెంకటరమణ, అచ్యుత్, చంద్రరావు పాల్గొన్నారు.

విద్యుత్తు బిల్లును ఆదా చేసుకోవచ్చు. మిగులు యూనిట్లు విక్రయించుకునేందుకూ అవకాశం ఉంది. సౌర విద్యుత్తును ప్రతి ఇంటికి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్తు పథకంలో ఇవన్నీ వీలవుతాయి. ఈ పథకం ద్వారా సౌర ఫలకల యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అవసరం మేరకు వినియోగించుకుని మిగిలిన యూనిట్లను విక్రయించుకోవచ్చు. దీనికి ప్రభుత్వమే రాయితీ అందించి, బ్యాంకు రుణాలను ఇప్పించి ఇంటిపై యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంది.

విద్యుత్తు వినియోగం.. మిగులు విక్రయం!

న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి



పీఎం సూర్యఘర్‌తో వినియోగదారులకు ప్రయోజనం

అల్లూరి సీతారామరాజు జిల్లా 12,251 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. 22 మండలాల్లోని 2972 గ్రామాల పరిధిలో 9.54 లక్షల మంది నివాసం ఉంటున్నారు. అందులో మారుమూల గ్రామాలే అధికం. ఈ గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించలేని పరిస్థితుల్లో సౌర పథకాలు ఏర్పాటు చేశారు. సమాఖ్యగా గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయడం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి చాలా చోట్ల మూలకు చేరాయి. ఆయా గ్రామాలతోపాటు వర్షాలు పడితే అధికశాతం ప్రాంతాలకు రోజుల తరబడి సరఫరా అందని పరిస్థితి. పూర్తిస్థాయిలో విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

రూ. 78 వేల రాయితీ

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి గృహాలకు సౌర విద్యుత్తు ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల యూనిట్‌కు రూ. 78 వేల వరకు రాయితీ ఇస్తోంది. అందులో కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్లకు రూ. 78 వేలు చొప్పున రాయితీ అందిస్తోంది. మూడు కిలో వాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయడానికి రూ. 1.45 లక్షల ఖర్చవుతుంది. అందులో కేంద్రం గరిష్ఠంగా రూ. 78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.

ఆదా ఇలా..!



పీఎం సూర్యఘర్ యోజన పోర్టల్ ముఖచిత్రం

సూర్యఘర్ వెబ్‌సైట్ ప్రకారం 1 కిలోవాట్‌కు నెలకు సుమారు 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రస్తుత వినియోగం ప్రకారం నెలకు రూ. 1000 బిల్లు వస్తుంది. అదే సౌరయూనిట్ ఏర్పాటు వల్ల అయ్యే ఖర్చు రూ. 338 మాత్రమే. దీంతో ఏటా రూ. 8 వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికి నెలకు రూ. 2 వేలు బిల్లు వస్తుండగా సోలార్ వినియోగం ద్వారా రూ. 333 మాత్రమే ఖర్చు అవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి ఏటా రూ. 32 వేల వరకు ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు వివరిస్తున్నారు.



సూర్యఘర్ పథకంపై గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సూర్యఘర్ పథకానికి ఆన్‌లైన్ ద్వారా, ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు pmsuryaghar.gov.in పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.

ఎవరికి ఎంత కెపాసిటీ అవసరం..?

నెలకు 0-150 యూనిట్ల విద్యుత్తు వినియోగించే వారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. 150 నుంచి 300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2-3 కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి వినియోగించే వారు 3 కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. ఈ యూనిట్ల ద్వారా నిక్షిప్తమైన విద్యుత్తును గృహ అవసరాలకు వినియోగించుకున్న తరువాత మిగులును నెట్‌మీటరింగ్ ద్వారా విక్రయించుకునే అవకాశాన్ని సైతం కల్పించారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

పీఎం సూర్యఘర్ ద్వారా సౌర విద్యుత్తు వినియోగించుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం దీనికి రాయితీ ఇస్తోంది. సులభంగా ఈ పథకాన్ని పొందవచ్చు. సద్వినియోగం చేసుకుంటే విద్యుత్తు ఆదాతోపాటు వినియోగదారులు మిగులు యూనిట్లను విక్రయించుకోవచ్చు. ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. – ప్రభాకర్‌రావు, ఏఈఈ, ఏపీఈపీడీసీఎల్, చింతపల్లి

అ వీ ఇ వీ

అయిదు లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: దూసరపాము శివారున సారా విక్రయిస్తున్న రాజవొమ్మంగికి చెందిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు సోమవారం ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి అయిదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సూరంపాలెం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ. 8600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విధి నిర్వహణలో కుప్పకూలిన వీఆర్వో

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: చావడికోట పంచాయతీ వీఆర్వోగా పనిచేస్తున్న కోసు లక్ష్మణ దొర సోమవారం ఉదయం మారేడుమిల్లి రెవెన్యూ కార్యాలయంలో విధుల్లో ఉండగా ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయన్ను తోటి సిబ్బంది సపర్యలు చేసి మారేడుమిల్లి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం వెళ్లేందుకు అంబులెన్సు లేకపోవడంతో వనవాసీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్‌కుమార్ తన కారులో ఆసుపత్రికి తరలించారు.

నీటి పథకం కార్మికుడి మృతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సత్యసాయి రక్షిత తాగునీటి పథకం కార్మికుడు కంగల పోతురాజుదొర (35) సోమవారం మృతి చెందాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పారు. గంగవరం ఇతని స్వగ్రామం. భార్య, ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కార్మిక యూనియన్ నాయకులు బొరగ త్రిత్వదాసు, బాలరాజు, వీరబాబు, శ్రీరామ్ తదితరులు సంతాపం తెలిపారు.

వాలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎటపాక, న్యూస్‌టుడే: గ్రామ వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీఐటీయూ మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. వాలంటీర్లతో సోమవారం ర్యాలీ నిర్వహించి ఎంపీడీఓ రామాంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ బలవంతంగా రాజీనామాలు చేయించిన వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఐ.వి., సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఆకిశెట్టి రాము, మండల అధ్యక్షుడు కొండబాబు, మండల కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కేవీకే శాస్త్రవేత్తలకు వీడ్కోలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ లలితకామేశ్వరి, కీటక విభాగం శాస్త్రవేత్త ఆదర్శ బదిలీ అయ్యారు. వీరిని సోమవారం కేవీకే ప్రాంగణంలో తోటి శాస్త్రవేత్తలు వీరాంజనేయులు, క్రాంతికుమార్, ప్రవీణ్‌బాబు తదితరులు సత్కరించారు. కేవీకే అధిపతిగా నియమితులైన డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అఖిల జగాలకు అమ్మవు నీవే



చినబరడలో అగ్నిగుండంలో నడుస్తున్న భవానీ భక్తులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం చింతపల్లి రంగా సెంటర్ వద్ద దుర్గమ్మతల్లికి మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పూజలు చేశారు. ఎంపీపీ అనూషాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: పెదబరడ పంచాయతీ చినబరడలో అగ్నిహోమం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. భవానీ భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కొందరు భక్తులు అగ్నిహోమంలో నడిచారు.



గుండాలకాలనీలో అమ్మవారికి భక్తుల పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: కింద్రలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులోని దుర్గమ్మతల్లి ఆలయంలో విజయదశమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దుర్గాష్టమి నుంచి దశమి వరకు మూడు రోజులు పండగ నిర్వహించనున్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ దుర్గాదేవి ఆలయంలో చండీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

మోతుగూడెం, న్యూస్‌టుడే: పొల్లూరు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు స్కందమాతదేవిగా, మోతుగూడెం ఏపీ జెన్‌కో కాలనీలోని వనదుర్గ దేవాలయంలో మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వాములు కుమార్‌స్వామి శర్మ, పవన్ కుమార్,



కింద్రలో..



ముంచంగిపుట్టులో..



అరకులోయలో..



మోతుగూడెంలో..

నేమలి శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో దుర్గాదేవి ఉత్సవ మండపాల్లో భక్తులు కుంకుమపూజలు చేశారు. మహిళలు, చిన్నారులు రాత్రి బతుకమ్మలను ఉత్సవ మండపాలకు తీసుకొచ్చి ఆటపాటలతో సందడి చేశారు.



వీఆర్‌పురంలో..

ఎటపాక, న్యూస్‌టుడే: చోడవరం, ఎటపాక, తోటపల్లి, నెల్లిపాక, గుండాలకాలనీ, నందిగామ, లక్ష్మీపురం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లోని మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసం రేపు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల్లో భాగంగా బుధవారం సరస్వతీదేవి జన్మనక్షత్రం సందర్భంగా అరకులోయ బీవీకే పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు ఏవీఎస్ ఆచార్యులు తెలిపారు. తల్లిదండ్రులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భాజపా బలోపేతానికి కృషి



నాయకులతో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర కార్యదర్శి మధుకర్

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుకర్ అన్నారు. సోమవారం చింతపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మన్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని,పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. నాయకులు కూడా కృష్ణారావు, జైతి ప్రభాకర్, వసుపరి శ్రీను, కదుల్ల శ్రీను పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తాజంగి గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని జనసేన నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జలజీవన్‌మిషన్ పథకం ద్వారా గ్రామంలో తాగునీరు అందించేందుకు రూ. 1.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. గుత్తేదారుకు ఇప్పటివరకు రూ.60 లక్షల నిధులు చెల్లించినా.. పనులు మాత్రం సగం కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. తాజంగి పీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది విధులకు సరిగ్గా హాజరుకావడం లేదన్నారు. తెదేపా నాయకులు కిలో పురుషోత్తం, భాజపా నాయకులు బోనంగి బాలయ్యపడాల్, సీపీఎం నాయకులు పాంగి ధనుంజై పాల్గొన్నారు.

కళాశాల భవనం లేక విద్యార్థుల ఇక్కట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఇందుకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు తహసీల్దార్ పి.రామకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నేపథ్యంలో ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలకు అనేక నిర్వాసిత గ్రామాలు వచ్చాయని గుర్తు చేశారు. జూనియర్ కళాశాలకు భవనం లేకపోవడంతో ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ స్పందిస్తూ గతంలోనే జూనియర్ కళాశాలకు ఎకరంన్నర స్థలం కేటాయించామన్నారు. భవన నిర్మాణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ కొండదొరల సంఘం జిల్లా నాయకుడు వెలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వాలాసి పంచాయతీ గొర్రిగుమ్మి గ్రామంలో సుమారు రూ.30 లక్షల నిధులతో రహదారి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచి సెంబి సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు దూరు గంగన్నదొర, మాజీ సర్పంచి బాగ గురుమూర్తి, కేరంగి ధర్మన్న, లుంగపర్తి సర్పంచి సన్యాసిరావు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు తదితరులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చెరపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సర్పంచి వనపల కాసులమ్మ ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని గ్రామాలకు అంతర్గత రహదారులు నిర్మిస్తామని తెదేపా మండల యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు తెలిపారు. జనసేన నాయకులు గుండ్ల రఘువంశి, స్థానిక నాయకులు వనపల రాజేష్, పొత్తూరు గంగరాజు, అరడా సత్తిబాబు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి సమాజం



ఆటపాటలు నేర్చుకుంటున్న చిన్నారులు

ఎటపాక, న్యూస్‌టుడే: బాల్యం నుంచే క్రమశిక్షణ అలవడితే భవిష్యత్తులో మంచి సమాజం ఏర్పడుతుందని పాస్టర్ నవీన్ లాజరస్ అన్నారు. మేడువాయి సియోను మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ నవీన్ లాజరస్, హెఫ్సీబా లాజరస్ ఆధ్వర్యంలో ఒకేషనల్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) సందడిగా జరిగింది. హైదరాబాద్ బెరాకా మినిస్ట్రీస్ హరీష్, ప్రియాహరీష్ పిల్లలకు ఆటపాటలపై శిక్షణ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏపీ జెన్‌కో ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు కాంప్లెక్స్‌లో ఒప్పంద కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఏపీ జెన్‌కో ఎస్‌ఈకి వారంతా వినతి పత్రం అందజేశారు. సోమవారం ఎస్‌ఈ రామభద్రరాజును టీఎన్‌టీయూసీ ప్రాంతీయ నాయకులు కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పారిశుద్ధ్య కార్మికుల పనిదినాలు పెంచాలని, జెన్‌కో ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. టీఎన్‌టీయూసీ ప్రాంతీయ కార్యదర్శి ఎస్.భాస్కరావు, బ్రాంచి కార్యదర్శి వెలుగూరి కృష్ణ, నడిగొట్ల వరప్రసాద్, పి.వరహాలు తదితరులు పాల్గొన్నారు.

కుంజవారిగూడెంలో వాలీబాల్ పోటీలు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: కుంజవారిగూడెంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను కొమరంబీం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంఘ సభ్యులు కుంజా రమేశ్ సోమవారం తెలిపారు. దసరా సందర్భంగా తొమ్మిది, పది తేదీల్లో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

కాఫీ కార్మికులకు భరోసా కరవు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ)కు చెందిన కాఫీతోటల్లో కార్మికులుగా పనిచేస్తున్నా తమకు ఎటువంటి భద్రత, భరోసా లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం చింతపల్లిలో ఐదు డివిజన్లకు సంబంధించిన కార్మికులంతా సమావేశమయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్, ఏఐటీయూసీ జిల్లా కో కన్వీనర్ అమర్ మాట్లాడారు. కార్మికుల బాగోగులను యాజమాన్యం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కూలి ధరల పెంపుతోపాటు కార్మికుల సమస్యలపై ఈనెల 15న అన్ని డివిజన్ మేనేజర్లకు సమ్మె నోటీసులు అందిస్తామన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరావు, అంపురంగి బుజ్జిబాబు, గడుతూరి సత్యనారాయణ, రాజారావు, దేవరాజ్, గిరి, పాపారావు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.




చింతపల్లిలో సమావేశమైన కాఫీ కార్మికులు


అధికారుల బాధ్యతల స్వీకరణ



రంపచోడవరం ఎంపీడీవోతో సిబ్బంది



కుమార్ (ఎంపీడీవో, అనంతగిరి)



శ్రీనివాసరావు (తహసీల్దారు,కూనవరం)



ప్రేమ్‌కుమార్ (ఎంపీడీఓ, డుంబ్రిగుడ)

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఎంపీడీవోగా శ్రీనివాసుదొర సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు, సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన హరికృష్ణ కాకినాడ జిల్లా కిర్లంపూడికి బదిలీ అయ్యారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి ఎంపీడీవోగా ఏవీవీ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నగేష్ భీమిలి బదిలీపై వెళ్లారు. జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న కుమార్‌ను ఇక్కడ నియమించారు.



చింతపల్లి తహసీల్దార్ రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి తహసీల్దారుగా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన సబ్బవరం తహసీల్దారుగా పనిచేశారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన రామకృష్ణ గూడెంకొత్తవీధి మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దారుకు డీటీ రాజ్‌కుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి స్వాగతం పలికారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల ఎంపీడీవోగా తేజ్ రతన్ బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈవోపీఆర్డీ డేవిడ్, ఏవో వీరభద్రరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ ఎంపీడీవోగా ప్రేమ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చారు.

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం తహసీల్దార్‌గా కె.శ్రీనివాసరావు విధుల్లో చేరారు. జగ్గంపేటలో డీటీగా చేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చి ఇక్కడ నియమించారు. ఇక్కడ పనిచేసిన నాగబాబు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు.



జి.మాడుగుల ఎంపీడీవో తేజ్ రతన్‌తో సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: రంపచోడవరం నుంచి పాతగాంధీ నగరం వెళ్లే రహదారి మలుపులో గోతులు పడ్డాయి. రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
– కె.రాంబాబు, సీహెచ్ వెంకట్రావు, పెదగెద్దాడ

✓: రహదారి గోతులకు త్వరలోనే మరమ్మతు చేయిస్తాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి నుంచి చింతూరు మధ్య ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. మలుపుల్లో మార్జిన్లు సరిగా లేకపోవడంతో వాహనాలు తరచూ ఆగిపోతున్నాయి. – నక్కా శ్రీను, చింతూరు

✓: ఘాట్ రోడ్డులో మలుపుల్లో మార్జిన్లు సరిచేసేందుకు చర్యలు చేపడతాం. రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి పీహెచ్‌సీ అంబులెన్సుకు షెడ్డు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తరచూ మరమ్మతుకు గురవుతోంది.
– సత్యనారాయణ, మారేడుమిల్లి

✓: షెడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం.
– హరికృష్ణ, వైద్యాధికారి, మారేడుమిల్లి

ద్విచక్రవాహనం చోరీ

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ రేకులకాలనీ వీధిలో సచివాలయ ఉద్యోగి టమికె శివ శంకర్ తన ఇంటి ముందు ఉన్న నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై సూర్యనారాయణ పేర్కొన్నారు.

పాడైన రహదారి పరిశీలన

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గోవాడ రహదారి దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఉమ్మడి జిల్లా టెలికాం సలహా కమిటీ సభ్యుడు అరిమెల రాజు అన్నారు. సంకాడ పంచాయతీ కుమ్మరపల్లి వద్ద పాడైన కల్వర్టు, గోవాడ రహదారిని సోమవారం పరిశీలించారు. తెదేపా సీనియర్ నాయకులు పొలిశెట్టి జగ్గయ్యదొర తదితరులు పాల్గొన్నారు.